క్లుప్తంగా

పెదబయలు ఎంపీడీవోగా పూర్ణయ్య బాధ్యతల స్వీకరణ



పెదబయలు: పెదబయలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా లొండాడ పూర్ణయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వి.విగ్గిన్స్‌ను విజయవాడకు బదిలీ చేశారు. పెదబయలు ఎంపీడీవో కార్యాలయంలో అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారి(ఏవో)గా పనిచేస్తున్న పూర్ణయ్యను అదనపు బాధ్యతలు అప్పగిస్తు జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. మండలంలోని 23 పంచాయతీ పరిధి లో ప్రజలకు ఏ సమస్యలున్న తమకు తెలియజేస్తే, ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలిపి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

చెక్‌డ్యాం పరిశీలన



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న జేఈ రామకృష్ణ

కొయ్యూరు: మండలంలోని డౌనూరు పంచాయతీ సుద్దలపాలెంలో పాడైన చెక్‌డ్యాంను నీటిపారుదల శాఖ జేఈ రామకృష్ణ శనివారం పరిశీలించారు. కొద్ది రోజుల కిందట జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు జిల్లా పరిషత్ సమావేశంలో మండలంలో పాడైన చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయాలని కోరారు.దీనిపై రైతు లు పడుతున్న అవస్థలను ఆయన వివరించా రు. దీంతో జేఈ రామకృష్ణ ఈ చెక్‌డ్యాంను పరిశీలించారు. అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి మరమ్మతు పనులకు నిధుల కోసం అధికారులకు పంపిస్తామని చెప్పారు.

వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



జీకే వీధిలో వీధిలైట్లను వేయిస్తున్న సర్పంచ్ సుభద్ర

గూడెంకొత్తవీధి: వీధి లైట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని గూడెంకొత్తవీధి పంచాయతీ సర్పంచ్ కొర్రాసుభద్ర అన్నారు. పంచాయతీలోని పలుచోట్ల వీధిలైట్ల ఏర్పాట్లను ఆమె శనివారం పరిశీలించారు. పంచాయతీ నిధులతో పారిశుధ్యం మెరుగుతోపాటు తాగు నీటి పథకాలు, వీధి లైట్ల నిర్వహణ చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానను. ఉపసర్పంచ్ కొర్రా రాంబాబు, వార్డు సభ్యులు త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా దేవి

మారేడుమిల్లి: ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి అన్నారు. శనివారం స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కారించేందుకు తను వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పలు పనులకు శంకుస్థాపన చేశారు. తెలుగు యువత అధ్యక్షుడు ఎం.విజయ్‌భాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు శేషుకుమార్, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దళారుల దందా



అడ్డాకులను లారీలో మైదాన ప్రాంతానికి తరలిస్తున్న దళారులు

- సంతల్లో సిండికేట్‌లదే హవా
- వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల ధరల నిర్ణయం దళారులదే
- నష్టపోతున్న గిరిజనం



వారపు సంతలో విక్రయానికి తీసుకువచ్చిన అడ్డాకులు

డుంబ్రిగుడ: గిరిజనులు కాయకష్టాన్ని దళారులు దోచుకుంటున్నారు.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు...అడవుల్లో సంచరించి కష్టంతో సేకరించిన అటవీ ఉత్పత్తులను గిరిజనులు అతికష్టంతో సంతల్లో విక్రయిస్తుంటారు.. అమ్మకాలు జరిపిన అనంతరం అన్ని ఖర్చులు పోగా మిగిలిన సొమ్ముతోనే జీవనం సాగిస్తుంటారు. అయితే సంతల్లో దళారుల బెడద గిరిజనులను వెంటాడుతోంది. దళారులు సిండికేట్‌గా మారి అమాయక గిరిజనుల నుంచి తక్కువ ధరలకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు...వారు నిర్ణయించిన ధరలకే గత్యంతరం లేక గిరిజనులు విక్రయించుకోవాల్సి వస్తోంది.. అయితే దళారులు వాటిని మైదాన ప్రాంతాల్లో రెట్టింపు అంతకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విధంగా గిరిజనులు దళారుల బారిన పడి మోసాలకు గురవుతున్నారు.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సంతల్లో దళారుల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు, జీసీసీ స్పందించి దళారుల దందాకు చెక్ పెట్టి గిరిజనుల నుంచి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పలువురు కోరుతున్నారు.

అడ్డాకులకు అందని గిట్టుబాటు

గిరిజనులు అతి కష్టంతో సమీప కొండల్లో వారం పొడువునా సేకరించి ఆకులను ఎండపెట్టి, మూటకట్టి, అరకు వారపు సంతలో విక్రయానికి తీసుకువస్తే వాటికి తగిన గిట్టుబాటు ధరలు కల్పించకుండా దళారులు లాభలు పొందుతున్నారు. అమ్మే సగం ఆటోల చార్జీలకు పోగా సొంత ఖర్చులకు ఉపాయోగిస్తే మిగిలేది శూన్యమని గిరిజనులు వాపోతున్నారు. మైదాన ప్రాంతం నుంచి కొంత మంది దళారులు సంతలో అడ్డగోలుగా గిరిజనులకు మోసం చేస్తున్నారు. మండలంలోని అరకు వారపుసంతలో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసిన అడ్డాకులను భారీ ధరలకు అమ్మి లాభాలు పొందుతున్నారు. గిరిజనుల వద్ద దళారులు మూట రూ.800, కావిడి రూ. 1600 లకు కొనుగోలు చేసి మైదాన ప్రాంత వ్యాపారులకు మూట రూ.1200, కావిడి రూ.2500 పైగా ధరలకు విక్రయిస్తున్నట్టు గిరిజనులు చెబుతున్నారు. వారం తపు కష్టం గిరిజనులది...లాభాలు దళారీలదిగా ఉందని చెబుతున్నారు. జీసీసీ అడ్డాకులను, అటవీ ఉత్పతులను కొనుగోలు సేసి గిరిజనులకు తగిన ధరలు కల్పించాలని గరిజనులు కోరుతున్నారు.

దళారుల నిలువుదోపిడి

అడ్డాకులే కాకుండా గిరిజనులు పండిస్తున్న కూరగాయలకు కూడా దళారీల బెడద తప్పడం లేదు. గిరిజనులు పండించి సేకరించి వారపుసంతలలో విక్రయించే క్యాబేజీ, ముల్లంగి, చిలగదుంప, అల్లం , కొండచిపుర్లు, ప్రతి అటవీ సందలను గిరిజనుల నుంచి దళారీలు నిలువు దొపిడి చేస్తున్నారు. దీంతో అమాయకా గిరిపుత్రులు అష్టకష్టాలు పడి పండించిన వారి పంటలతో పాటు అటవీ ఉత్పత్తులకు సరైన మద్దతు ధరలు కల్పించకుండా దళారుల మోసాలకు గిరిజనులు బలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జీసీసీ వ్యవస్థ అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి అడవి బిడ్డలను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

డుంబ్రిగుడ: అడ్డాకులే కాకుండా గిరిజనులు పండిస్తున్నా కూరగాయాలకు కూడా దళారీల బెడద తప్పడం లేదు. గిరిజనులు పండించి సేకరించి వారపుసంతలలో విక్రయించే క్యాబేజీ, ముల్లంగి, చిలగదుంప, అల్లం, కొండచిపుర్లు, ప్రతి అటవీ సందలను గిరిజనుల నుంచి దళారీలు నిలువు దొపిడి చేస్తున్నారు. దీంతో అమాయకా గిరిపుత్రులు అష్టకష్టలు పడి పండించిన వారి పంటలతో పాటు



సంతలో విక్రయిస్తున్న ముల్లంగి

అటవీలో సేకరించిన దినుస్సులకు సరైన మద్దతు ధరలు కల్పించకుండ దళారుల మోసా కోరలకు గిరిజనులు బలవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత గిరిజన సహాకార సంస్థ వ్యవస్థ కల్లు తెరిచి అడవి బిడ్డల కష్టనికి తగు పలితన్నిచ్చే చర్యలకు పూనుకోవాలసిన అవస్యకత్త ఎంతైన ఉందిని గిరిజన మేదావులు అభిప్రాయని వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



కాయకష్టం చేసి మేము పండిచే కూరగాయలు, అటవీ ఉత్పతులకు విక్రయాల్లో సరైన ధరలు లేక పోవడంతో నష్టపోతున్నాం. వారపు సంతల్లో దళారుల బెడద వెంటాడుతోంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దళారులను అరికట్టి జీసీసీ కొనుగోలు చేపట్లాలి అప్పుడే గిరిజనులు న్యాయం జరుతుంది.

– కొర్రా గాసన్న, దేవాలయం గ్రామం, కితంలగి పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

జిల్లాకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం వివక్ష



సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: రాష్ట్ర వ్యాప్తంగా రూ.2712.50 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాకు(ఏజెన్సీ) నిధులు ఎందుకు కేటాయించలేదని, గిరిజనులంటే చులకన, చిన్నచూపు ఉందని సొలభం సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఐసరం హనుమంతరావు ధ్వజమెత్తారు.ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో 2024ఆగష్టు 23న జరిగిన పనులు గుర్తింపు తీర్మానాలు, మన గ్రామ పంచాయతీ, మన గ్రామ సభలో ఇచ్చిన ప్రతిపాదనల నిధులను ప్రభుత్వం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇతర పనులకు కేటాయించిన మాదిరిగా మెటీరియల్ కాంపోనెంట్ కింద పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అల్లూరి జిల్లాకు ఎందుకు నిధులు విడుదల చేయలేదని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు అన్ని ప్రాంతాల్లో బహిరంగ గ్రామ సభలు ఏర్పాటు చేసి పనులు గుర్తించి వాటికి ఎస్టిమేషన్లు వేసి ప్రభుత్వానికి పంపినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి, గిరిజన ప్రాంతమైన అల్లూరి జిల్లాకు నిధులు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా అభివృద్ధిలో చాలా వెనుకబడిన ప్రాంతమని, అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి లేక, కూలీ పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అల్లూరి జిల్లాపై పక్షపాత ధోరణి మంచికాదని, అల్లూరి జిల్లాకు నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

ఆకుకూరలతో ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నీలిమ

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ నేరుడువలస అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో నీలిమ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలతోనే సంపూర్ణ ఆరోగ్యం దోహదపడుతుందన్నారు. మునగాకు, కరివేపాకు ప్రాధాన్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి రోజు వారి ఆహారంలో ఆకుకూరలతో పాటు మనగ, కరివేపాకును వినియోగించాలని సూచించారు. అనంతరం గుంటసీమ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పోషకాహార పంపిణీపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

పిడుగుపాటుకు రెండు పశువుల మృతి



గొడుగురాయిలో పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ గొడుగురాయి గ్రామంలో శనివారం సాయంత్రం వర్షంతో పాటు పిడుగుపాటుకు రెండు పశువులు మృతి చెందాయి. గ్రామంలో కుండపోత వర్షంతో ఉరుములు, మెరుపులు, భీకర శబ్దాలతో పిడుగులు పడ్డాయి.గొడుగురాయి గ్రామానికి చెందిన వంజరి పిన్నం నాయుడు తమ పశువులను గ్రామ సమీపంలోని అడవిలో మేతకు తొలుకొని వెళ్లాడు. సాయంత్రం 5గంటల సమయంలో వర్షం వస్తుండటంతో పశువులను శాలలో కట్టటానికి తొలుకొని వస్తున్న సమయంలో భయంకర శబ్దంతో పిడుగు పండడంతో పిన్నంనాయుడు క్షేమంగా బయటపడగా ఆవు, దూడ రెండు పశువులు అక్కడకక్కడే మృతి చెందాయి. విద్యుత్ స్తంభంపై పిడుగు పడటం వలన విద్యుత్ వైరు తెగి కిందపడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. పిడుగుపాటు మృతి చెందిన పశువులు సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం మృతి పశువులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

వాణిజ్య పంటలపై అవగాహన



పంటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి: ఉపాధి పథకం ద్వారా చేపట్టిన ఉద్యాన పంటల క్షేత్రాలను శనివారం చింతపల్లి ఎంపీడీఓ ఆశాజ్యోతి పరిశీలించారు. చౌడుపల్లి పంచాయతీ లోని గాడిదలమెట్ట, గొయ్యిలమెట్ట గ్రామాల్లో ఆమె ఏపీఓ లక్ష్మీనారాయణమూర్తితో కలిసి సందర్శించారు. వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈసీ మధుసూధన్, వీఆర్‌పీలున్నారు.


రహదారులు నిర్మించాలని వినతి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ ఆనందరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలాభివృద్ధికి అతి ముఖ్యమైన రోడ్లను నిర్మించాలని కోరుతూ ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మిల ఆధ్వర్యంలో మండల ప్రజాప్రతినిధులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండల ఎగువప్రాంతంలో బొడ్డగండి, చింతలపూడి, కానివాడ, దారగడ్డ, గుర్తేడు, పాతకోట పంచాయతీల్లోకి గ్రామాలకు వెళ్లేందుకు అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, మారేడిమిల్లి మండలాలు దాటుకుంటు సుమారు 170 కిలోమీటర్లు దూరం చుట్టు తిరిగి వెళ్లాల్సి ఉందన్నారు.. మండల కేంద్రమైన వై.రామవరం నుంచి మఠంభీమవరం పోతవరం గ్రామాల మీదుగా 13 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మిస్తే సుమారు 30 కిలోమీటర్ల దూరంలో మండల ఎగువ ప్రాంతంలోని ఆయా ఆరు పంచాయతీలకు చేరుకోవచ్చని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ అటవీశాఖ అభ్యంతరాలతో దశాబ్దాల తరబడి ప్రాంత వాసులకు తీరని కలగా మిగిలిందని చెప్పారు. సమస్య పరిష్కారంలో భాగంగా రోడ్డు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. వానమామిడిగొంది-పులుసుమామిడి, అన్నంపాలెం, బూరుగుపాలెం, అమ్మపేట, చందుర్తి గ్రామాల మీదుగా రేగడిపాలెం, కానివాడ-చాపరాయి, చింతలపుడి-నీలపాలెం, బొడ్డగుంట-చింతకొయ్య, రాచపాలెం- కణతలబంద, తోటకూరపాలెం- పూతిగుంట గ్రామాల రోడ్లు నిర్మించాలని వినతిలో కోరారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



డీడీ విజయశాంతికి వినతిపత్రాన్ని అందజేస్తున్న హెచ్‌ఎంలు

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ గెజిటెడ్ హెడ్‌మాస్టార్ అసోసియేషన్ సభ్యులు శనివారం డీడీ విజయశాంతిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, ఎల్‌ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను పదోన్నతులు ద్వారా భర్తీ చేయాలని కోరారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ సీనియర్ లిస్టు తయారు చేసి పీవోతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. సంఘం అధ్యక్షుడు సుందర్, కార్యదర్శి కుమార్, సభ్యులు తులసి, మల్లమ్మ, బిఎస్ కుమార్, రామరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



సొవ్వాలో చెల్లా చెదురుగా పడి ఉన్న బైకులు

డుంబ్రిగుడ: గొప్పులవలసలో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఒడిశా వైపు బైక్‌పై గసభ పంచాయతీ గొందివలస గ్రామానికి చెందిన వంతాల శ్రీను వెళ్తుండగా, ఒడిశా నుంచి ఆంధ్ర వైపు బైక్‌పై వస్తున్న వాహనచోదకుడు గొప్పులవలస సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు సపర్యలు చేసి ఒడిశాకు చెందిన యువకుడిని ఒడిశా ఆస్పత్రికి, గొందివలసకు చెందిన యువకుడిని అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వై.రామవరంలో రోడ్డుపై చెత్తను తొలగిస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్-డీ42 బెటాలియన్ అదనపు బలగాల పోలీసుల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో బస్టాండు, ఆస్పత్రి, పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.రాధ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన స్వచ్ఛ అడ్డతీగల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపీడీవో డి.చిన్నబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా వారానికి రెండు గంటల పాటు శ్రమదానం చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేదించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. చెత్తను ఆరుబయట పారవేయకుండా షాపుల యజమానులకు, ప్రజలకు ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది తెలియజేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు చెత్త సేకరణ కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన ప్లాస్టిక్ డబ్బాలను అందజేశామన్నారు. అన్ని గ్రామ పంచాయితీల పరిధిలోనూ సచివాలయాల సిబ్బంది ప్రజాప్రతినిధులను, వ్యాపారులు, ప్రజలను భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని ముందుకు నడపాలన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



బందవలస వద్ద కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న సర్పంచ్ మోస్య, సీపీఎం నాయకులు

అనంతగిరి(అరకులోయ రూరల్): హామీలు అమ లు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం నాయకుడు, టోకురు పంచాయతీ సర్పంచ్ కిల్లో మోస్య చెప్పారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి వేంగడ పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లో శనివారం పర్యటించారు. వర్షాలకు కొట్టుకుపోయిన రహదారులను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామల గిరిజనులతో సమవేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమ లు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని, గ్రామా ల్లో ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. పంచాయతీ పరిధిలో బందవలస వంతెన అధ్వానంగా మారిందని, వర్షాలు కురిసినపు డు ఆయా గ్రామల గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారన్నారు. వంతెన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. వేంగడ మెయిన్ రోడ్డు నుంచి బందవలస మీదుగా మెటపాడు వరకు బీటి రోడ్డు మంజురు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రోజు రోజుకు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజలకు తీవ్ర భారం మోపుతుందన్నారు, కూటమి ప్రభుత్వం నూతన మద్య పాలసీ పేరుతో అక్రమంగా బెల్ట్ షాపులు ఏర్పాటుకు ప్రోత్సహిస్తుందని ధ్వజమెత్తారు.1/70, పీసా చట్టాలకు వ్యతిరేకంగా గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు బినామీ పేర్లతో అక్రమంగా మద్య షాపులు ఏర్పాటు చేస్తున్నారన్నా రు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనపై వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. మాజీ సర్పంచ్ కొండలరావు, నాయకులు అప్పన్న, సింహాద్రి, దేముడు, కొండబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



అనర్బలో పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో తేజ్‌రతన్, సర్పంచ్ రత్నకుమారి

హుకుంపేట: మండలంలోని సంతారి, తీగలవలస పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులకు సర్పంచ్ పాంగి బేసు, పాడి అప్పలనాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామల్లో జరుగుతున్న ఉపాధి హామి పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డు సభ్యులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో భీరం, కుంబిడిసింగి, వంతాల పంచాయతీలో గల అనర్బ, కుంబిడిసింగి, చింతగొంది గ్రామాల్లో శనివారం పశువుల శాల, కందకాల పనులను ఎంపీడీవో తేజరత్నన్, సర్పంచ్ మాధుల రత్నకుమారి ప్రారంభంచారు. ఏపీవో కొండబాబు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతీ గ్రామంలోని ప్రజలు వంద రోజులు పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తదితరలు పాల్గొన్నారు.

ఆదివాసీలపై కూటమి ప్రభుత్వం కుట్ర



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్ర, రాంబాబు

అరకులోయ రూరల్: ఆదివాసీలకు కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో నట్టేట ముంచేందుకు కుట్ర పన్నుతుందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు కిల్లో సురేంద్ర, లోత రాంబాబులు తెలిపారు. వారు శనివారం విలేకరులతో ఎన్నికల హామీల ప్రకారం బోయ వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్పించడంలో భాగంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించే కుట్ర చేస్తుందన్నారు. ఈ తీర్మాణం ఆమోదం జరిగితే ఆదివాసీ గిరిజనులకు తీరాని అన్యాయం జరుగుతుందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన బోయ వాల్మీకిలను గిరిజన తెగలో విలీనం చేసే ఆలోచన కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పార్టీలు, కులమతాలకతీతంగా కూటమి ప్రభుత్వం ఎత్తుగడ, కుట్ర రాజకీయల వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

మాడుగుల రూరల్: అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, వనుగుమ్మ జి.యు.పి.ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న కుంద్రపు సత్యం మృతి పట్ల ఆయనతో చదువుకున్న పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. సత్యం గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందిన విషయం తెలిసిందే. చీడికాడ మండలం, ఖండివరం గ్రామానికి చెందిన సత్యం 1998 డీఎస్సీలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా గతేడాది విధుల్లో చేరారు. ఈ సందర్భంగా 1986 పదో తరగతి పూర్వ విద్యార్థులు సత్యం మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

34 మందికి వైద్య పరీక్షలు



అప్పలరాజుపేటలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుష్మా, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సుష్మా శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో సుమారు 34 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్టు చెప్పారు. స్థానిక జీపీఎస్‌లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ రామారావు, ఏఎస్ఎం భవాని, హెచ్వీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మయ్య, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశ రత్నం, అంగన్‌వాడి కార్యకర్త కుమారి పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

వై.రామవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై ఎస్ఐ బి.రామకృష్ణ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణా, సారా విక్రయాలు వంటి జోలికి వెళ్లొద్దన్నారు. డ్రగ్స్(మత్తుమందులు)కు యువత దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరకృప, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోతుగూడెం: ఏజెన్సీలో గిరిజనులు గంజాయి సాగుకు, రవాణాకు దూరంగా ఉండాలని, మన్యంలో గంజాయి నిర్మూలన కోసం కృషి చేయాలని డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగంపాడు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం సంకల్పం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి వలన అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని దీనికి దూరంగా ఉండాలన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



అడ్డతీగల: మండలంలోని రాజానగరంలోని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి నివాసం వద్ద తోటలోని శనివారం బ్రహ్మకమలాలు వికసించాయి. ఈ పుష్పాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. వీటిని చూడడానికి స్థానికులు తరలివస్తున్నారు.